సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు కాగా.. గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వారికి చెక్కులు అందజేశారు. నాయకులు అమీనుద్దీన్, సంతోష్‌నాయుడు, రాజశేఖర్ రెడ్డి, సాయి తదితరులున్నారు.

లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా బలవంతరెడ్డి



అభినందిస్తున్న కమిటీ సభ్యులు

అల్వాల్: అల్వాల్ లోతుకుంట లారీ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడిగా నల్ల బలవంతరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. లారీ అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ముందుగా గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సన్మానం



శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన గోగూరి శ్రీధర్‌రెడ్డిని గురువారం పలువురు బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాయకులు మహేందర్‌రెడ్డి, శివ, అభిషేక్, మురళీకృష్ణ, నిఖిల్, రాజ్‌కుమార్, హేమంత్ తదితరులున్నారు.

అభినందన



అల్వాల్: నెరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శివశంకర్ ఇటీవల రాచకొండ కమిషనరేట్ ×సిక్స్ అన్యువల్ స్పోర్ట్స్- 2025లో 4 -100 రిలేలో రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా నెరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఇన్‌స్పెక్టర్ సందీప్ ఇతర సిబ్బంది శివశంకర్‌ను ఘనంగా సన్మానించారు.

సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ



అల్వాల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం అల్వాల్ సూర్యనగర్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విగ్రహం తయారు చేసిన బసవరాజును సత్కరించారు. బాలరాజు, మల్లారెడ్డి, గోపాల్‌రావు, ఆనంద్, జ్యోతి, శ్రీకాంత్‌యాదవ్, మల్లికార్జున్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాజు, ఏసుగౌడ్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులున్నారు.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం



కుషాయిగూడ: ఏఎస్‌రావునగర్ డివిజన్, రాధిక చౌరస్తా సమీపంలో ప్రారంభానికి సిద్ధమవుతున్న ఓ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గురువారం రాత్రి 8:30 గంటల సమయంలో రెస్టారెంట్ నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు యజమానులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది సకాలంలో ఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే రెస్టారెంట్‌లోని ఫర్నిచర్ పూర్తిగా కాలి బూడిదైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటుచేసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఫుట్‌పాత్‌పై నిర్మాణ సామగ్రి విక్రయం



సైనిక్‌పురి జలమండలి కార్యాలయం ఎదుట..



బాటసారికి దారేది ?

- ఫుట్‌పాత్‌లపైనే యథేచ్ఛగా వ్యాపారాలు
- నడిచేందుకు దారిలేక స్థానికులకు ఇబ్బంది

మౌలాలి: వాహనాల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్ దారులు ఆక్రమణలకు గురౌతున్నాయి. చిరు వ్యాపారులు, ఇతర నిర్మాణ సామగ్రి అమ్మకందారులు ఆక్రమించి వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీంతో మౌలాలి డివిజన్, వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని ప్రజలు రోడ్డుపై నడవాలంటేనే ఇబ్బంది పడుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం..

సైనిక్‌పురి పరిధిలోని జలమండలి కార్యాలయం ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలతో రద్దీ సమయాల్లో పాదచారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వినాయక్‌నగర్ డివిజన్ పరిధి కృపా కాంప్లెక్స్, దినకర్‌నగర్, ఓల్డ్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆక్రమణలు ఉన్నాయని, స్థానికులు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి..



ఉదయం, సాయంత్రం వేళల్లో కార్యాలయాలకు వెళ్లే సమయంలో సైనిక్‌పురి జలమండలి కార్యాలయం వద్ద ప్రధాన మార్గం వాహనాల రద్దీతో బిజీగా మారుతోంది. ఆ సమయంలో పాదబాటపై నడవాలంటే స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఏదైన పెద్ద ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించాలి.

– మేక వెంకటేశ్వరరావు, సైనిక్‌పురి

మా సమస్య ఎవరికి చెప్పాలి..?



పాదబాటపై నడిచేందుకు స్థలం లేక రోడ్లపై నడిచే పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మా సమస్య ఎవరికి వినిపించాలి. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సైనిక్‌పురి జలమండలి ఎదురుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలి.

– చిల్లా మధుసూదన్, నెరేడ్‌మెట్

తగిన చర్యలు తీసుకుంటాం

సర్కిల్ పరిధిలోని ప్రధాన మార్గాలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించాం. దీనిపై వారు స్పందించకుంటే నెరేడ్‌మెట్ పరిధిలోని పలుచోట్ల ఆక్రమణలను తొలగించాం. సైనిక్‌పురి జలమండలి సమీపంతో పాటు వినాయక్‌నగర్ ప్రాంతంలో పాదబాటను ఆక్రమణలను తొలగిస్తాం.

– శ్రీనివాసరావు, మల్కాజిగిరి పట్టణ ప్రణాళికాధికారి

ముంపు సమస్యలు పరిష్కరిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: విష్ణుపురి ఎక్స్‌టెన్షన్ కాలనీ పరిసరాల్లో ముంపు సమస్య పరిష్కరిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం అధికారులతో కలిసి పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడాది కాలంగా ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు సమస్యను తీసుకెళ్లామన్నారు. ఎట్టకేలకు సుమారు రూ.కోటి ఐదు లక్షలతో బాక్స్‌డ్రైన్ నిర్మాణానికి ప్రణాళికను రూపొందించామని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని, బాక్స్‌డ్రైన్ నిర్మాణం పూర్తైతే ముంపు సమస్య పరిష్కారం అవుతుందన్నారు. డీఈ మహేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తదితరులున్నారు.

పరామర్శ



మల్కాజిగిరి: మాజీ మంత్రి తీగుళ్ల పద్మారావును మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఉన్నారు.

ఆరోగ్యబీమా మార్పుపై కార్మికుల ధర్నా



ఎన్‌ఎఫ్‌సీ ధర్నాలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కుషాయిగూడ: కార్మికుల ఆరోగ్యబీమా మార్పును నిరసిస్తూ 'కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్' (ఎన్‌ఎఫ్‌సీ) కార్మికులు గురువారం 'సేవ్ సీహెచ్‌ఎస్‌ఎస్' అని నినాదాలు చేస్తూ.. కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం కార్మికులకు అమలవుతున్న కాంటిబ్యూటరీ హెల్త్ సర్వీస్ స్కీమ్ (సీహెచ్‌ఎస్‌ఎస్)ను కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యపథకం (సీజీహెచ్‌ఎస్)లో విలీనం చేయాలని, ఎన్‌ఎఫ్‌సీ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం యోచనను నిరసిస్తూ.. కార్మికులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్‌సీ ఇండస్ట్రీయల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి టీ.ఆర్.దేవకుమార్, రతన్‌సింగ్ మాట్లాడుతూ.. అటామిక్ ఎనర్జీ సంస్థల్లో కార్మికులు రేడియేషన్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అప్పట్లోనే డాక్టర్ హోమీజేబాబా కార్మికుల ఆరోగ్య స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్యం అందేలా చూశారన్నారు. తదానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు కార్మికులను కాంట్రిబ్యూటరీ స్కీమ్‌లో కలిపాయన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు కార్మికులు 1 శాతం కాంట్రిబ్యూషన్ అందజేసి సీహెచ్‌ఎస్‌ఎస్‌లో అన్ని రకాల వైద్య సేవలు పొందుతున్నామన్నారు. రేడియేషన్‌లో పనిచేసే కార్మికులకు మెరుగైన వైద్యం సీహెచ్‌ఎస్‌ఎస్‌లోనే సాధ్యమవుతుందన్నారు. కార్మికులను కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకంలో కలిపితే తీరని అన్యాయం జరుగుతుందన్నారు. యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకుని యథావిధిగా సీహెచ్‌ఎస్‌ఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఎఫ్‌సీ కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. మురళీధర్‌గౌడ్, ట్రెజరర్ భరత్‌కుమార్, రాకేష్‌ప్రసాద్, రంగనాథరావు, ఎండీ యాకుబ్, కోటిబాబు, కృష్ణంరాజు, బోసుబాబు, హన్మంతు, నరేష్‌కుమార్, శ్రీనివాసులు, శ్రీశైలం, సుబేదార్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తా: ఆర్ కృష్ణయ్య

ఎన్‌ఎఫ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారికి సంఘీబావం తెలిపిన ఆయన సీహెచ్‌ఎస్‌ఎస్ మార్పు అంశాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి పాత పద్ధతుతే కొనసాగేలా చూస్తానన్నారు. అణు ఇంధన సంస్థల్లో రేడియేషన్‌లో పనిచేసే కార్మికులకు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశరక్షణ రంగం అభివృద్ధికి పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన సేవలందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రక్షణరంగం పటిష్టంగా ఉన్న దేశాలే అగ్రభాగాన నిలుస్తాయని ఆ దిశగా కార్మికులు కృషి చేయాలన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో గురువారం 21,22,23,24,25,26,27,28 డివిజన్లలో నిర్వహించిన వార్డు సభలను కమిషనర్ రామలింగం, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, చీరాల నర్సింహ్మా, రాసాల వెంకటేశ్‌యాదవ్, రమావెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

యువతకు నేతాజీ ఆదర్శం

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: నేతాజీ బాట యువతకు ఆదర్శమని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. నేతాజీ చూపిన బాటలో యువత నడవాలన్నారు. పాండురంగంగౌడ్, రాష్ట్ర మహిళా మోర్చా శిల్పారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, విగ్రహ కమిటీ అధ్యక్షులు అభిషేక్‌గౌడ్, బీజేపీ నేతలు నవీన్, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, అశోక్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, సంతోషరెడ్డి, రవీందర్‌రెడ్డి, అనితాపద్మారెడ్డి పాల్గొన్నారు.

కాప్రా: భారత స్వాతంత్ర్య పోరాట గమనాన్ని మార్చిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. నేతాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. బ్రిటీష్ వారిని గడగడలాడించి భారతమాత ముద్దుబిడ్డ నేతాజీ పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



కాప్రా నేతాజీనగర్‌లో కార్పొరేటర్ స్వర్ణరాజ్



కమలానగర్‌లో..

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో రూ. 9.28కోట్లతో 1,2,3,4,6,7,925,26వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు ఆయన కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రూ. 45 కోట్లతో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ పనులు చేపట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, కొత్త లక్ష్మీరవిగౌడ్, జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, శోభారాణివెంకటేష్‌గుప్తా, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు

రామంతాపూర్: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. గురువారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచి ట్రాఫిక్ నిబంధనల గురించి తెలుసుకోవాలని, దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మన దేశ జనాభాలో అధికశాతం పాఠశాల విద్యార్థులే ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఆమె కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లారం నర్సింహారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ జగన్

కాప్రా: కాప్రా సర్కిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కాప్రా సర్కిల్‌లో కొనసాగుతుంది. ఈ సర్వేను గురువారం డిప్యూటీ కమిషనర్ జగన్ పరిశీలించారు. మొత్తం 41,551 దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు 28,895 దరఖాస్తుల సర్వే పూర్తి చేశామన్నారు. మరో 12,656 దరఖాస్తులకు సంబంధించిన సర్వే మిగిలి ఉందని సర్కిల్ అధికారులు తెలిపారు.

నిధులు మంజూరు చేయండి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గురువారం జీహెచ్‌ఎంసీ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఓల్డ్ మల్లాపూర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నిధులు మంజూరు చేయాలని మేయర్‌ను కార్పొరేటర్ కోరారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు చేరాలి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఉప్పల్: ప్రభుత్వ పథకాల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఉప్పల్ డీసీ ఆంజనేయులును బీజేపీ ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ పథకాల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని డీసీకి వినతి పత్రం అందజేశారు. డబుల్ బెడ్రూమ్, రేషన్‌కార్డుల విషయంలో అర్హులైన వారందరికీ అందేలా చూడాలని కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు మహంకాళి లక్ష్మణ్‌ముదిరాజ్, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, యాదగిరి, రేవెల్లి రాజు, సింగారం కార్తీక్, వెంకటేష్, బోరంపేట మురళి, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్సియర్ల వేధింపులు తాళలేక..

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

అల్వాల్: ఫైనాన్సియర్ల వేధింపులు తాళలేక ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదమ్మనగర్‌లో నివసించే కుర్మయ్య (55) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి ఇద్దరు సంతానం. కాగా ఆటో కొనేందుకు ఏడాది క్రితం ప్రైవేట్ ఫైనాన్స్ వద్ద లోన్ తీసుకుని ఆటోను కొనుగోలు చేశాడు. ఇటీవల ఫైనాన్స్ చెల్లించడంలో ఆలస్యమవడంతో ఫైనాన్సియర్లు వేధింపులు అధికమయ్యాయి. నెల రోజుల క్రితం వారు ఆటోను తీసుకుని వెళ్లిపోయారు. సొంత ఆటో లేకపోవడంతో అప్పుడప్పుడు కిరాయి ఆటోను నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో సొంత ఆటోలేక మనోవేదనకు గురై గురువారం అందరు ఇంట్లో ఉండగానే గదిలోకి వెళ్లి చేయి కొసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



వీఎస్‌రెడ్డినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: త్వరలోనే వీఎస్‌రెడ్డినగర్ కాలనీలో రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్, వీఎస్‌రెడ్డినగర్‌లో రోడ్ల సమస్యలపై కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గతంలో ఫిర్యాదు చేశారు. గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కాలనీని ఆమె సందర్శించారు. త్వరలోనే రోడ్ల పనులకు నిధులు మంజూరు చేయించి శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వాసుదేవరెడ్డి, రాంచందర్, నాగిళ్ల బాల్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, తిరుమలరెడ్డి, రమేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



కల్యాణి

అల్వాల్: యువతి అదృశ్యమైన ఘటన నెరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేజేనగర్‌లో నివాసం ఉండే కల్యాణి (21) ఈనెల 21న ఉదయం తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఆమెకు ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుందని, పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో విద్యార్థి..



చౌహాన్ సాయికిరణ్

ఉప్పల్: విద్యార్థి అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ చౌవాన్ పండిత్ కుమారుడైన చౌహాన్ సాయికిరణ్ (22) రామంతాపూర్ హోమియోపతి కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల్లో అనంతరం తండ్రి హాస్టల్‌లో 21న చేర్చి ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం కుమారుడికి తల్లిదండ్రులు ఫోన్‌చేసినా స్విచ్ఛాఫ్ రావడం, హాస్టల్, కాలేజీలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో తండ్రి ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.